# రైతు వేదికలు.. చైతన్య దీపికలు

## వికారాబాద్ జిల్లాలో 97 క్లస్టర్లలో రైతు వేదిక నిర్మాణాలు



ధారూరు మండలంలోని కెరెళ్లి కస్టర్ రైతువేదిక



ధారూరు మండలంలోని మూన్నుర్‌సోమారం కస్టర్ రైతువేదిక



ఫరుఖ్‌నగర్ మండలంలోని చించోడ్ కస్టర్ రైతువేదిక



కొండనగూడ కస్టర్ రైతువేదిక



నారాయణపూర్, కొత్తగడి క్లస్టర్..



ధారూరు క్లస్టర్ రైతువేదిక



గుమ్మడవెల్లి క్లస్టర్ రైతువేదిక

### రైతువేదికల్లోనే చర్చించుకుంటున్నాం..



ప్రతి క్లస్టర్‌కు ఒకటి చొప్పున ప్రభుత్వం నిర్మించిన రైతు వేదికల్లోనే వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల సమస్యలపై చర్చించుకుంటున్నాం. ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలు, రైతులు సాగు చేసిన పంటలకు చీడపీడలు సోకినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నెలకోసారి అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నారు. ఎంతో ముందుచూపుతో రైతువేదికలు నిర్మించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు.

**– మొద్దు అంజిరెడ్డి, ఉత్తమరైతు (ఇబ్రహీంపట్నం రూరల్)**

### వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు..



వ్యవసాయ సాగు పద్ధతులపై అధికారులు రైతు వేదికల్లో సమావేశాలు పెట్టి అవగాహన కల్పిస్తున్నారు. పంటలకు చీడపీడలు సోకితే ఏం చేయాలి.. పంట ఏ దశలో ఉంటే ఏ ఎరువులు వాడాలో రైతులకు తెలుపుతున్నారు. పంట నష్టపోకుండా ముందే వచ్చే సమస్యలను చెప్పుతుండడం ఎంతో ఉపయోగకరంగా ఉన్నది. వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ శ్రద్ధ తీసుకోవడం అభినందనీయం.

**– పీ అనంతయ్య, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, రైతు ముజాహిద్‌పూర్(కులకచర్ల)**

### అధికారులు దగ్గరయ్యారు..



రైతు వేదిక కట్టిన నాటి నుంచి వ్యవసాయాధికారులు రైతులకు దగ్గరయ్యారు. అప్పట్లో ప్రతి చిన్న పనికి కొడంగల్ ఆఫీసుకు పోవాల్సి వచ్చేది. అక్కడ సార్లు కనిపించే వారు కాదు. పది సార్లు తిరగాల్సి వచ్చేది. రైతు వేదికలో అధికారి ఉండటంతో ఎప్పటికప్పుడు సమాచారం అందుతున్నది. ఏదైన పని చేసుకోవాలంటే ఇక్కడే పూర్తి అవుతున్నది. అప్పుడప్పుడు రైతులకు మీటింగ్ పెట్టి ఏ పంట వేసుకోవాలి, మందులు ఏ విధంగా వాడాలి, ఏఏ మందులు, విత్తనాలు వాడితే ఎక్కువ లాభం వస్తుందని చెబుతున్నారు. దీంతో కొంత వరకు తక్కువ పెట్టుబడితో వ్యవసాయం చేసుకునే ఆస్కారం ఏర్పడింది. రైతు వేదిక కట్టడం వల్ల రైతులకు ఎంతో మేలు కలుగుతున్నది.

**– పకీరప్ప, రైతు, అప్పాయిపల్లి (కొడంగల్)**

వికారాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : నియంత్రిత సాగు విధానంతోపాటు మారుతున్న కాలానికి అనుగుణంగా సాగు చేసే పంటల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు రైతులకు ఓ చర్చా వేదిక అవసరమని రాష్ట్ర ప్రభుత్వం రైతు వేదికలను అందుబాటులోకి తీసుకువచ్చింది. గతంలో ఆయా పంటల సాగులో సమస్యలు వస్తే రైతులు వ్యవసాయాధికారులను కలవాలంటే మండల కేంద్రానికి లేదంటే జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి ఉండే పరిస్థితులుండేవి. పంటల సాగులో మెళకువలు, ఆధునిక సాగు విధానంలో వస్తున్న మార్పులపై గతంలో ఎలాంటి అవగాహన లేకుండా రైతులు సాగు చేస్తుండేవారు, దీంతో మూస పద్ధతితో రైతులు ఆయా పంటల సాగుతో ఆశించిన దిగుబడి రాకపోవడంతో నష్టపోయిన పరిస్థితులున్నాయి. అంతేకాకుండా రైతులు సమావేశాలు నిర్వహించుకునేందుకు ప్రత్యేకంగా స్థలం లేకపోవడంతో ఒక్కోసారి ఒక్కోచోట సమావేశాలను నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఉండేది, అయితే ఫసల్ బీమా, ఆత్మ తదితర రైతు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించేందుకు రైతులందరికీ ఒకేచోట సమావేశాలను నిర్వహించేందుకు సరైన స్థలం లేకపోవడంతో పంచాయతీ కార్యాలయాలు, ఆలయాలు, చెట్ల కింద నిర్వహించే పరిస్థితి ఉండేది. రైతు వేదికలు అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతులకు నిర్వహించే శిక్షణా, అవగాహన కార్యక్రమాలన్నింటిని ఒకేచోట నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా వానకాలం సీజన్‌తోపాటు యాసంగి సీజన్‌లో ఏయే పంటలను సాగు చేయాలనే దానిపై వ్యవసాయాధికారులు రైతులకు రైతు వేదికలే వేదికగా అవగాహన కల్పిస్తున్నారు. అంతేకాకుండా క్లస్టర్ల వారీగా నియమింపబడే వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రతి రోజూ రైతు వేదికల్లో అందుబాటులో ఉంటూ రైతులు సాగు చేసే పంటల సాగుతోపాటు ఇతర ఏ సమస్యలున్నా రైతులు ఏఈవోల దృష్టికి తీసుకెళ్తున్నారు. రైతులకు పంటల సాగుతో అధిక దిగుబడులు సాధించేలా అధికారులు సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు అందజేస్తున్నారు. గతంలో మండలానికి ఒక ఏఈవో, కొన్ని చోట్ల రెండు మండలాలకు కూడా ఒక ఏఈవో ఉన్న దృష్ట్యా అధిక గ్రామాలు ఉండడంతో రైతులకు అందుబాటులో ఉండేందుకు వీలుండేది కాదు. ప్రతి 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్ ఉండడం, ప్రతి క్లస్టర్‌కు ఒక ఏఈవో ఉండడంతోపాటు రైతు వేదికల్లోనే ప్రతి రోజూ ఏఈవోలు అందుబాటులో ఉంటుండడంతో రైతులకు మేలు జరుగుతుంది. అయితే జిల్లాలో 566 గ్రామ పంచాయతీలుండగా ప్రతి 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్ చొప్పున 97 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో రైతు వేదిక నిర్మాణానికి ప్రభుత్వం రూ.22 లక్షల చొప్పున రూ.21.34 కోట్లతో జిల్లాలో రైతు వేదికలను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

- రైతులకు చర్చా వేదికలు
- 5 వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌ను, ప్రతీ క్లస్టర్‌లో రైతు వేదిక
- పంటల సాగు, వాతావరణ పరిస్థితులపై శిక్షణ
- రైతు వేదికల్లో నిత్యం అందుబాటులో ఉంటున్న వ్యవసాయాధికారులు
- ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన



కలకొండ రైతు వేదిక

### అప్పట్లో రచ్చకట్టలు.. ఇప్పుడు రైతు వేదికలు..



రైతువేదిక కట్టక ముందు అధికారులను కలువాలంటే కొడంగల్‌కే వెళ్లాలి. ఉంటే కలిసే వాళ్లం లేందంటే ఆఫీసు ముందే కూర్చునే వాళ్లం. ఇప్పుడు మా ఊళ్లోనే రైతు వేదిక భవనం కట్టడంతో ఇక్కడ అధికారి ఉంటుండు. దీంతో చాలా వరకు సమయం కలిసి వస్తుంది. సబ్సిడీ విత్తనాలు వచ్చినా, రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసినా ఉపయోగించుకొంటున్నాం.

**– ఆశన్న, రైతు, అప్పాయిపల్లి (కొడంగల్)**

### ఏ విత్తనాలు వాడాలో చెబుతున్నారు..



రైతు వేదికలు నిర్మించడం వల్ల పొలాలకు అనుగుణంగా ఏ విత్తనాలు వాడాలో అధికారులు తెలుపుతున్నారు. సమావేశాలను ఏర్పాటు చేసి సాగు పద్ధతులను వివరిస్తున్నారు. దళారుల చేతిలో మోసపోకుండా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.

**– బాలు (చేవెళ్లటౌన్)**

### అధికారులు అందుబాటులో ఉంటున్నారు..



రైతు వేదికలు నిర్మించిన తర్వాత అధికారులు అందుబాటులో ఉంటున్నారు. గతంలో అధికారులను కలువాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. కార్యాలయాల చుట్టూ తిరిగేటోళ్లం. సీఎం కేసీఆర్ రైతులకు రైతు వేదికలను నిర్మించడం వల్ల ఎంతో మేలు జరుగుతున్నది.

**– గోరెంట్ల మల్లేశ్ యాదవ్, గ్రామం కలకొండ (మాడ్గుల)**

### రైతు బాంధవుడు కేసీఆర్



సీఎం కేసీఆర్ రైతు బాంధవుడు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆదుకుంటున్నాడు. రైతుల గోస తెలిసిన నాయకుడు కాబట్టే రైతు వేదికలను నిర్మించి అండగా నిలిచాడు. రైతులు సాగుపై చర్చించుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వ పథకాల సమాచారాన్ని అధికారులు అందిస్తున్నాది.

**– కురుమ వెంకటేశ్, మిర్జాగూడ (శంకర్‌పల్లి)**

### రైతు ప్రభుత్వం..



రైతుల కోసం అనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న బీఆర్ఎస్ రైతు ప్రభుత్వంగా పేరు తెచ్చుకున్నది. రైతువేదికల నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాల రైతులు సభలు, సమావేశాలు నిర్వహించుకుంటున్నారు. గతంలో వేదిక లేక ఎవరికి తోచినట్లు వారు సాగు చేసుకుని నష్టపోయేవాళ్లం. వ్యవసాయ అధికారులు రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

**– సామ మల్లారెడ్డి, దేవుని ఎర్రవల్లి(చేవెళ్ల)**



కేశంపేట క్లస్టర్ రైతువేదిక

### రైతు పక్షపాతి సీఎం కేసీఆర్..



రైతు పక్షపాతి సీఎం కేసీఆర్. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అండగా నిలుస్తున్నారు. రైతు వేదికల నిర్మాణంతో సాగులో ఏర్పడిన సమస్యలపై రైతులమంతా కలిసి చర్చించుకుంటున్నాం. రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా వ్యవసాధికారులు రైతు వేదికల్లో సమావేశాలను ఏర్పాటు చేసి నివృత్తి చేస్తున్నారు. పంట నష్టపోకుండా సలహాలు, సూచనలు చేస్తున్నారు. ఏలాంటి అవసరం వచ్చినా రైతు వేదిక వద్దకు వెళ్లి అధికారులతో పనులు సూలువుగా చేసుకుంటున్నారు. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న బీఆర్ఎస్ సర్కార్‌కు కృతజ్ఞతలు.

**– శంకర్, రైతు ఫరూఖ్‌నగర్(షాద్‌నగర్‌రూరల్)**


### ఎన్నో విషయాలు తెలుసుకోగలుగుతున్నాం..



రైతు వేదికలు అన్నదాతలకు ఎంతో ఉపయోగం.. రైతులను ఒకచోటకు చేర్చి సమావేశం నిర్వహిస్తుండటంతో ఎన్నో విషయాలు తెలుసుకోగలుగుతున్నాం. వ్యవసాయ అధికారులు పంటల సాగుపై సలహాలు, సూచనలు ఇస్తున్నారు. పొలం నుంచి మట్టిని సేకరించి భూసార పరీక్షలు నిర్వహించి ఏ పంట సాగు చేయాలి, ఎంత మోతాదులో ఎరువులు వాడాలి తదితర విషయాలను తెలియజేస్తున్నారు. అధికారులు ఇస్తున్న సూచనలతో పంట పెట్టుబడి ఖర్చులు తగ్గడంతోపాటు దిగుబడి పెరిగింది. రైతుల సంక్షేమం కోసం పని చేస్తున్న సీఎం కేసీఆర్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు.

**–సిద్ధిగారి చెన్నయ్య (కడ్తాల్)**

### ధాన్యం నిలువ చేసుకుంటున్నాం..



రైతు వేదిక భవనంలోనే ధాన్యం కొనుగోలు చేపట్టడం వల్ల ధాన్యం నిలువ చేసుకునేందుకూ సౌకర్యంగా ఉన్నది. రైతులంతా కూర్చొని మాట్లాడుకునే సదుపాయం కలిగింది. లేదంటే ఎవరికి వారే అన్నట్లుగా ఉండేది. వ్యవసాయాధికారులను కలువాలంటే ఒక్కప్పుడు మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. సీఎం కేసీఆర్ రైతు కష్టాలను దృష్టిలో పట్టుకోని ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా రైతు వేదికలను నిర్మించడం వల్ల వ్యవసాయాధికారులు అందుబాటులో ఉంటున్నారు. టేకులపల్లిలో రైతు వేదిక నిర్మించారు. ఏఈవోలు అందుబాటులో ఉంటున్నారు. రైతు వేదికలతో రైతులకు ఎంతో మేలు సమకూరుతున్నది.

**– గొల్ల రాములు, టేకులపల్లి (మోమిన్‌పేట)**

### రైతుల వద్దకే అధికారులు..



తెలంగాణ ప్రభుత్వం రాక ముందు వ్యవసాయ అధికారులను కలువాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. ఆళ్లకు ఒక తావు ఉండేది కాదు. కేసీఆర్ ప్రభుత్వంలో అధికారులను కలువడానికి సులువైంది. రైతు వేదికల్లో ఉంటూ రైతుల వద్దకే వస్తున్నారు. ఎరువులు, విత్తనాలకు ఇబ్బంది లేకుండా పోయింది. ఎలాంటి సమస్యలైనా వెంటనే పరిష్కారమవుతున్నాయి. రైతు సమావేశాలు ఏర్పాటు చేసి సాగు విధానాలపై అవగాహన కల్పిస్తున్నారు. పంటలకు సోకే చీడపీడల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలుపుతున్నారు. రైతుల కోసం ఇంతగా శ్రమిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.


**– ఎట్టయ్యగౌడ్, రైతు, సురంగల్(మొయినాబాద్)**

### అందుబాటులోనే సేవలు..



రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. రైతువేదికలతో అధికారులు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఎలాంటి సమస్యలున్నా ఒక్కదగ్గర కు చేరి చర్చించుకోవడానికి రైతువేదికలు ఉపయోగపడుతున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.

**– మహ్మద్ జానిపాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ (ఇబ్రహీంపట్నంరూరల్)**



నందిగామ రైతు వేదిక